# జుల్మానా

"పరవాలేదు, మంచి సరుకే పట్టుకొచ్చారు ఎ.ఎస్.ఐ గారు" అన్నాడు ఎగ్జామినర్ కాపీయిస్టు.

ఆఫీసు గదిలో నవ్వులు గలగల లాడాయి.

"అలాగా! నీకు సరుకుల విషయంలో మంచి అనుభవమున్నట్టుందే!" అన్నాడు క్రిమినల్ గుమస్తా పళ్ళు మూరెడు బయట పెట్టి, ఎడం చేత్తో క్రాపు సరిజేసుకుంటూ.

మళ్ళీ గలగల నవ్వులు....!

"ఏ మనుభవం లెండి, మీలాంటి పెద్దల్ని చూసి నేర్చుకున్నదే అంతాను" అంటూ తిరుగుబాణం వేశాడు ఎగ్జామినర్ కాపీయిస్టు.

ఆ వేళ కోర్టు ఆఫీసు ఆనందంగా, ఉత్సాహంగా ఉంది. అందరి క్రాపుల్లో ఒక్క వెంట్రుకయినా చెదరలేదు. అప్పుడే చక్కగా దువ్వి నట్టుంది అంతాను. కుర్చీల్లో కూచున్న వాళ్ళు స్టయిల్‌గా కూచుని ఉన్నారు. కుర్చీలు దొరకని వాళ్ళు టేబుళ్ళకు ఆనుకుని మరీ స్టయిల్‌గా నించుని ఉన్నారు. ప్రతి చిన్న మాటకూ ఆఫీసంతా నవ్వుతోంది. ఎవరు అమీనాలో, ఎవరు క్లర్కులో, ఎవరు స్టెనోలో, ఎవరు ఎవరో గుర్తించటం కష్టం. వాళ్ళందరితో పాటు ఎ.ఎస్.ఐ (అసిస్టెంటు సబ్ ఇన్‌స్పెక్టరు), ఇద్దరు పోలీసు కానిస్టేబుల్సూ ఉన్నారు. ఎప్పుడూ ఏడుపు గొట్టు మొహాల్తో

జిడ్డోడుతూ, తమ పనేదో తల వంచుకుని, చేసుకొని పోయే ఈ మనుషు లేమిటీ, ఈవాళ ఇంతగా జోకులు వేసుకొంటూ ఒకరిపై ఒకరు హాస్యా లాడుతూ ఉండట మేమిటీ అని ఆ ఆఫీసుతో పరిచయమున్న ఎవరైనా వస్తే తప్పకుండా ముక్కున వేలేసుకుంటారు.

అయితే దీని కంతకీ అసలు కారణం కోర్టు వరండాలో, ఆఫీసు గదికెదురుగా కూచుని ఉన్న ఇద్దరు ఆడపిల్లలే! (ఎగ్జామినర్ కాపీయిస్టు భాషలో 'సరుకులు.')

"అన్నట్టు వాళ్ళ పేర్లేమిటి?" కొత్త గుమస్తా అడిగాడు ఎ.ఎస్.ఐని.

"ఎడంవైపున కూచుందే ఆరంజి రంగు చీర కట్టుకుని, దానిపేరు సరళ, పచ్చ చీర దాని పేరు వసంత."

అంత ఉత్సాహంగా ఉన్న ఆఫీసులో తనకేమీ పట్టనట్టుగా కూచుని ఏదో రాసుకుంటున్న వ్యక్తి రామారావు. ఒక్కసారి మాత్రం కిటికీలోంచి గజ్జికుక్కను చూసినంత అసహ్యంగా చూశాడు సరళనీ, వసంతనీ.

వసంత తన సోగకళ్ళను చిన్నవిగానూ, పెద్దవిగానూ చేస్తూ మాట్లాడిస్తోంది సరళని. సరళ మాత్రం అన్నిటికి 'ఊఁ' కొడుతోంది. వీళ్ళ చూపులూ, వేళాకోళాలూ మాకోలెక్కా అన్నట్టుంది వాళ్ళిద్దరి ప్రవర్తనా.

"ఒళ్ళు అమ్ముకోవడం ఎంత అసహ్యమండీ!" గట్టిగానే అన్నాడు రామారావు ఫైళ్ళ మధ్య నుంచి తలెత్తి.

నిజమే అని ఎవరూ అనలేదు. అందుకేనేమో దాన్ని మరింత స్పష్టంగా చెప్పడం కోసం— "ఈ పడుపు వృత్తి అనేది దేశానికీ, జాతి గౌరవానికీ పెద్ద మచ్చండీ! ఒళ్ళమ్ముకోవడం ఎంత నీచం, ఎంత అసహ్యం! ఎస్సైగారూ! ఎటువంటి తప్పయినా ఒళ్ళమ్ముకోవడం కంటే

నయమేనండీ, ఆఖరికి దొంగతనమైనా.... ఇలా అంటున్నావని మీరేమైనా అనుకోండి ఫర్వాలేదు. అసలూ, ఒళ్ళమ్ముకున్న డబ్బుతో కడుపు నింపు కోవడమేమిటీ? మరీ దారుణం. అబ్బా! నా కయితే వీళ్ళని చూడగానే కంపరం పుడుతోంది.'' మినీ లెక్చరు ఇచ్చాడు.

ఇదంతా వింటున్నారు బయట కూచున్న సరళ, వసంత.

"వీళ్ళకి రిమాండు ఇస్తారా మాజిస్ట్రేటు?" కొత్త గుమాస్తా అడిగాడు.

"అదేం వుండదు, జరిమానా వేయొచ్చు." ఎ.ఎస్.ఐ. తన బట్ట తలని ఎడం చేత్తో తడుముకుంటూ అన్నాడు.

"మీరేనా సరళా, వసంతా?" కోర్టు ప్యూను అడిగాడు.

"వాళ్ళేలే, తీసుకు పో నాయనా!" కీచు గొంతుతో అరిచాడు స్టెనో.

మళ్ళీ ఆఫీసులో నవ్వులు. ఈసారి రామారావుకు కూడా నవ్వొచ్చింది.

వసంతా, సరళ చేంబర్స్‌లోకి వెళ్ళారు. వారి వెంట ఓ కానిస్టేబులూ వెళ్ళాడు.

"ఇలాంటి బ్రోతల్స్‌ని కఠినంగా శిక్షించాలండి! వట్టి జరిమానాతో వదలకూడదు" అన్నాడు రామారావు.

"నిజమే, మీరన్నది కూడా. కఠిన శిక్ష వేస్తే తాము చేస్తున్నది తప్పని తెలిసి వస్తుంది" అన్నాడు ఎ.ఎస్.ఐ.

కాసేపటికే తిరిగొచ్చారు సరళ, వసంతలు. ఇప్పుడు ఏకంగా ఆఫీసులోకే దూసుకొచ్చేశారు. అందరి కళ్ళూ వాళ్ళిద్దరి పైనే.

"ఫైన్ వేశారు సార్!" ఎవరూ అడక్కుండానే చెప్పింది వసంత.

"ఎంత?" ఆత్రంగా అడిగాడు ఎ.ఎస్.ఐ.

"చెరో ముప్ఫయి రూపాయలు."

"అంతేనా కనీసం వందయినా ఫైన్ వేసుండాల్సింది" స్టెనో.

"వంద రూపాయలు మాబోటి వాళ్ళ కెక్కడి నుండి వస్తాయి సార్? మీలాగా జీతాలయినా రావే మాకు!" అంది సరళ.

"మీ కెందుకు జీతాలూ? అందరి జీతాలూ మీవేగా! ఏమదృష్టం! ఎవరో కష్టపడతారు. డబ్బు లిచ్చి పోతారు."

ఆఫీసు మళ్ళీ నవ్వింది— కొత్త గుమస్తా మాటల్లోని వ్యంగ్యం గమనించి.

వసంతా, సరళలు నిర్లక్ష్యంగా నేలవేపు చూస్తున్నారు.

"ఫైన్ ఎక్కడ కట్టాలి?" సరళ అడిగింది.

"అదిగో అక్కడ" స్టెనో చూపించాడు రామారావు వేపు.

"ఇంద తీసుకోండి" అంటూ జాకెట్లో దోపుకుని ఉన్న ఆరు పది రూపాయల నోట్లని రామారావు టేబుల్ మీద ఉంచింది వసంత.

ఆ డబ్బునీ, వసంత, సరళల్నీ మరీ అసహ్యంగా చూసి "అరవై కాదు....ఎనభై "అన్నాడు రామారావు.

"ఎందుకు? చెరి ముప్ఫయ్యేగా ఫైనూ?" అంది సరళ.

"అది అంతే.... ఎనభై కి తక్కువ ఫైన్ కట్టించుకోను."

"ఇరవై రూపాయలు మీరు ఫైన్ వేస్తున్నారా? సరే.... వసంతా ఇంకో ఇరవై ఇచ్చెయ్యవే" అంది సరళ.

"మా రామారావుకి అందరూ సమానమే.... ఎవర్నీ వదలడు" ఎవరో గొణుగుతున్నట్టుగా అన్నారు.

"సార్. ఇందాకా మీరన్నారే ఒళ్ళు అమ్ముకోవటం చాలా అసహ్యం అని! ఇది మా ఒళ్ళు అమ్ముకున్న డబ్బే!" అంది వసంత ఇరవై రూపాయల నోటు టేబుల్‌పై పెడుతూ.

రామారావు రసీదులు రాసి తలెత్తి చూసే లోపల కోర్టు వరండా దాటి వెళ్ళిపోతున్నారు వసంతా, సరళలు.

ఆఫీసులో నవ్వులూ, మాటలూ, ఉత్సాహమూ అంతా మాయం! వాటినీ కొంగున కట్టుకెళ్ళారేమో వాళ్ళు *

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 8 - 4 - 87)